# 18. బా. బా.

పిన్నికి ఉన్నట్టుండి మాట పడిపోయింది!

అని బాబాయికి నాచేత టెలిగ్రాం ఇప్పించారు అక్కడున్న వాళ్ళు అందరూ.

'తొందరపడవద్దు. నే వచ్చేదాకా ఆగవలసింది'

అనే బాబాయి స్పందన చూసి తెల్లబోయాం! వాళ్ళకా ఇటూ అటూ ఎవరూలేరు, దూరపు బంధువుని నేనొక్కణ్ని తప్ప. నాతో కలిసి ఆత్రుత చూపిస్తున్న వాళ్ళు ఇరుగూ పొరుగూ జనం. వాళ్ళని ఆకర్షించింది పిన్నికి పాపం ఏం జబ్బుచేసిందో అనే సానుభూతికాదు. ఎందుకు చెప్మా యిలా ఉన్నట్టుండి అయిపోయింది అనేది తెలుసుకోవాలనే తహతహ వాళ్ళని అన్నిటికంటే ఆశ్చర్యపరచింది బాబాయి రిప్లయి టెలిగ్రాము! ఇలా ఎందుకు జరిగిందని?

ఉత్తరం మీద ఉత్తరం రాస్తే వచ్చి అక్కడున్నవాణ్ణి నేను. నన్ను పట్టుకుందేమిటి యీ గొడవ! "ఈసారైనా కుప్ప నూర్పిళ్ళకి నేనెళ్ళక తప్పదు. ఈ వారం రోజులూ ఎలా గడిపి పెడతావో నీదే భారం". అంటే ఉండిపోయాను. ఊరు కదిలిరావటమంటే మాటలా, ఎన్ని చూసుకోవాలి! తీరావచ్చాక ఇలాంటి చిక్కుల్లో పడ్డావేమిటి కర్మ!

ఆ రాత్రి జరిగింది ఇదీ: సినిమాకెళ్ళి తొమ్మిదిన్నరకి ఇంటికి తిరిగొచ్చాను. దగ్గిరగావేసున్న వీధి తలుపుని ఇలా కొట్టేనో లేదో, బార్లా రెండు తలుపులూ తెరుచుకున్నాయి. లోపల గడియవేసిలేదు! అజాగర్త అన్నమాట పిన్ని జన్మలో ఎరగనిది. గుండె దడదడ కొట్టుకుంటుండగా లోపలికి వెళ్ళేను. పడక్కుర్చీలో సొమ్మసిల్లినట్టు పిన్ని కూచుని ఉంది. చూస్తున్నట్టే కళ్ళు తెరచి ఉన్నాయి కాని మన చూపుల్లా అనిపించక గతుక్కుమన్నాను. ఎంతగట్టిగా పిలవనీండి మాట్లాడదు. ఎటువంటి రెస్పాన్సులేదు. కుదిపి చూశాను. అరిచిచూశాను. ఊహు జవాబు చెప్పదే.!

డాక్టరుగారు అన్ని పరీక్షలూ చేసిపెదవి విరిచారు. అలా చెయ్యడానికి కారణం పేషెంటు ప్రమాదస్థితిలో ఉందనికాదు. ఎందుకిలా జరిగిందీ అంతు పట్టడంలేదంటే ఆఖరికి ఆయన అన్నారు కదా!

" ఫిజికల్‌గా ఏ లోపమూ కనపడ్డం లేదండీ. మరి మానసికంగా గాయపరచేది ఏం జరిగి వుంటుందో మీరే ఊహించాలి."

"ఓ వేళ ఏ దొంగ అయినా దూరితే ఆవిడ భయపడి ఉంటారేమో. ఇంట్లో ఏమైనా పోయాయేమో చూసుకున్నారా!" అన్నారు ఒకరు.

తలుపు తీసుంటే అలాగే అనుకుని ముందే ఇల్లంతా ఓ రౌండు కొట్టివచ్చాను. ఎక్కడ పెట్టిన వస్తువులు అక్కడ ఉన్నాయి. అదీగాక మా వాళ్ళయిల్లు మంచి జనసమ్మర్దంగల చోట వుంది. రాత్రి పది గంటలదాకా బాగా హడావిడిగా ఉంటుంది.

అన్నట్టు మరచేపోయేను. చూపులు ఎక్కడో ఏ లోకంలోనో ఉన్నాయి. నోరు సరే సరి. పడిపోయింది. చెవుడు కూడా వచ్చి వుండాలేమరి! వీటన్నిటికీ మెదడేకేంద్రం గదా!అన్నారు డాక్టరు గారు ఆ సంగతి ముందే గమనించాను నేను. ఎంత గట్టిగా అరచినా చలనం లేదు.

రెండిళ్ళ అవతల మానసిక రోగాల కుర్రాడొకడున్నాడు. ఎలా తెలిసిందో కబురు, నిమిషాలమీద పరిగెత్తుకొచ్చేడు. పేషెంట్లతో ఎలాగైనా పడొచ్చు. పాపం ఉలుకూ పలుకూ లేకుండా పడిపోయింది. కుర్రడాక్టరు న్యూసెన్సు భరించలేక నా బుర్ర గిర్రున తిరిగిపోయింది. అంతలా బోరు కొట్టేశాడు.

అతను పదేపదే చెప్పిన ఓ విషయం మాత్రం మా అందరికే కాక అక్కడి దూలాలకీ వాసాలకీ కూడా పట్టిపోయి వుండాలి.

'మీ బాబాయిగారు రానూ వస్తారు, అన్నీ సర్దుకుపోనూపోతాయి. కాని ఈ మేధ అనేది ఉందే, ఎంత అద్భుతమో అంత సున్నితంకూడా. కాలం గడిచిపోతే ఎన్నో మార్పులకి లోనై మన చెయ్యి దాటిపోవచ్చు. మీ బాబాయిగారు వచ్చేలోగా మీరు చెయ్యవలసింది ఏమైనా వుందేమో ఆలోచించండి. దయచేసి ఈ రాత్రి మీరు నిద్రపోకండి. ఏం జరిగి వుంటుందో ఎందుకు ఆమె గుండె దెబ్బ తిని ఉంటుందో ఆలోచించండి. ఆమె చిన్ననాటి సంఘటన: అది నిరుడు అవొచ్చు పదేళ్ళ కిందటిదయినా అవొచ్చు; ఏదైనా మీకు తెలుసునేమో గుర్తు చేసుకోండి. ఆమె ఇంద్రియాలలో తీవ్ర సంచలనం కలిగించి నిశ్చలం చేసేసిన సంఘటన ఏ రోజు జరిగినా జరగొచ్చు. ఏ విధంగానైనా అది మళ్ళీ ఆమెకి గుర్తు చేసేటట్లు చేస్తే - వదులయిన సీల సకాలంలో బిగించ గలిగితే-పోయిన గొంతుక ఆమెకి మళ్ళీ ఇచ్చిన వారౌతారు. ప్లీజ్. ఆమె గురించి డిటెయిల్డ్‌గా ఆలోచించండి. టైమ్ ఫేక్టర్ చాలా ఇంపార్టెంటు. ఈ ఒక్క రాత్రీ ఆమె కోసం ఖర్చు పెట్టండి. రాత్రివేళ లేపుతే నేనే మనుకుంటానో అని మీరు మొహమాట పడొద్దు. ఏ మాత్రం క్లూ దొరికినా ఇక ఆలోచించక నన్ను పిలవండి. ఇదెలా పరిష్కారం చెయ్యాలో నాకు స్ఫురించవచ్చు. ఇద్దరం కలసి ఈ సమస్యని సాధించగమేమో ఎవరు చెప్పగలరు? పోనీ ఓ పనిచేస్తే?''

అప్పటికే పదకొండు దాటింది. శీతాకాలం కనక ఎంతో రాత్రి అయిపోయినట్టుంది. ఎందాకని ఉంటారు గనక. యిరుగూ పొరుగూ అప్పుడే ఎవరిళ్ళకి వారు సర్దుకున్నారు. బతిమాలి ఎలాగో పనిమనిషినీ దానికి తోడుగా దాని పదేళ్ళ కొడుకునీ ఉంచగలిగేను. ఆ రాత్రి వాళ్ళప్పుడే కూచుని కునికేస్తున్నారు. మొదట వచ్చిన డాక్టరు కష్టపడి రెండు మాత్రలు మింగించి మళ్ళీ పొద్దుట వచ్చి చూస్తానన్నాడు. వెళ్ళిపోయాడు.

ఎదురు చూడని యీ సంఘటనతో ఎవరూలేని యీ అర్ధరాత్రి మరో ప్రాణి ఏదైనా నిజంగా మనిషికి తోడే. కాని ఈ కుర్ర డాక్టరు ధోరణి ఎవరు భరించగలరు!

'పోనీ ఓ పనిచేస్తే?' అని అతను అనగానే అదేదో వినేస్తే అతను వెళ్ళిపోతాడేమో అని ఆశ

కలిగింది. ఏవిటన్నట్టు చూశాను.

'ఇంటికెళ్ళి పరుపు చుట్ట తెచ్చేసుకుంటాను. బ్రహ్మచారి ముండావాణ్ణి. ఏ పంచలో శరీరం చేరేస్తే నాకుతెల్లారదు గనక! ఎప్పుడే అవసర మొస్తుందో ఎవరు చెప్పగలరు!'

ఎన్నో విధాల నచ్చజెప్పి అతన్ని గుమ్మందాటించేసరికి నా దుంప తెగింది. గుమ్మం వరకూ మా యిల్లేగాని ఆతర్వాత రోడ్డు అతనిదేగా! ఏ మాత్రం ఏమరడానికి వీల్లేదనీ ఆలశ్యంవల్ల ఎంత ఆపద అయినా జరగవచ్చనీ, ఆ తర్వాత బతుకంతా ఏడ్చినా చేజారిపోయిన అవకాశం మరి రాదనీ, రోడ్డుమీద నిలబడి పదే పదే బోధించి మీరిక ప్రతిక్షణం మీ పిన్ని గురించే ఆలోచించాలి. ఒక్క సెకను వేస్టు చేస్తే లాభం లేదనుకోండి. అని అరగంట మాత్రమే వేస్టుచేసి, భారంగా యింటివైపు అడుగులు వేశాడా మనస్తత్వ వేత్త. బ్రతుకు జీవుడా అని తలుపేసుకు లోపలికి వచ్చాను. పావు గంట గడిచిందో లేదో ఎవరో తలుపు కొట్టినట్టయింది ఇదేమిటి బాబాయి రావడానికి ఇంతరాత్రి ఏ బండి ఉందబ్బా. అనుకుంటూ తలుపు తీశాను. మళ్ళీ కుర్రడాక్టరే. ఏదో ఇంజక్షను తీసుకొచ్చాడు.

"ఇది ఉందో లేదో నా మందుల చెస్ట్‌లో అనుకున్నాను. అదృష్టవశాత్తూ దొరకింది. ఇది మెంటల్‌కేస్ గదా, యీ ట్రాంక్విలైజర్ యిస్తే ఏం జరిగినా మానినా బ్రెయిన్‌మీద టెన్షన్ తగ్గి కాస్త నిద్రయినా పడుతుంది. అందుకని తీసుకొచ్చాను. మీరలా ఆవిడ జబ్బ పట్టుకోండి. ఇది పని చెయ్యొచ్చు, మానొచ్చు. ఓ వేళ నిద్రపడితే ఆ విశ్రాంతి ఎంతసేపు ఉంటుందో కూడా చెప్పలేం. ఆవిడ కళ్ళు తెరిచినప్పుడు మాత్రం ఎవరో ఒకరు దగ్గిరుండి ఏమంటున్నారో గ్రహించాలి. ఆఖరికి అస్పష్టంగా ఒకటి రెండు అక్షరాలు పలికినా సరే వెంటనే అదేమిటో తెలుసుకోవాలి. మనం యిచ్చే రెస్పాన్సును బట్టే ఆవిడ మళ్ళీ మాటరాడం రాకపోడం ఆధారపడి ఉన్నాయి. కంటికి రెప్పలా ఎలా కాపాడుకుంటారో ఏమో... నన్ను ఉండనివ్వరాయె." అంటూ మరో పావుగంట ఇన్‌స్ట్రక్షన్స్ యిచ్చి అతను శలవు తీసుకున్నాడు.

ఇంక నిద్దరేమిటి, నా మొహం, ఎప్పుడో తేలిపోయింది. చల్లటి నీళ్ళతో ఓసారి మొహం కడుక్కుని వచ్చి మడత మంచం మీద తలగడ వేసుకొని కొంచెం విశ్రమించాను.

ఎంతో యాక్టివ్‌గా ఉండే పిన్ని పడక్కుర్చీలో అలా ఓ పక్కకి మొహం వేలేసుకుని ఉండడం చూస్తే ఎంతో కష్టమనిపించింది. పిన్నికీ బాబాయికీ ఎవరూ లేకపోవడం ఒకటేకాదు; నాకూ నా అన్న వాళ్ళు ఎవరూ లేకపోవడం అనేది మమ్మల్ని యింతలా కలిపిందేమో. ఈనాటిదా, వాళ్ళకీ నాకూ సంబంధం! రెండేళ్ళ పాటు కనపడకపోతే చాలు, వాళ్ళైనా నన్ను చూడ్డానికి వచ్చేస్తారు.

దగ్గిర ఉన్నంత సేపూ ఆ డాక్టరంటే అంత విసుక్కున్నానా; తీరా అతనూ వెళ్ళిపోయి ఒంటరిగా మిగిలేసరికి అతని ఆప్యాయత గుర్తుకొచ్చి నా ప్రవర్తనకి నాకే సిగ్గేస్తోంది. పిచ్చి చూపులు చూసే పిన్ని ఇప్పుడిప్పుడే కాస్త నిద్రలోకి మళ్ళిందంటే పాపం అతనే కారణం కాదూ?

"మీ బాబాయిగారా, రేపొద్దుటకిగాని రాలేనంటున్నారు. ఏమో. యీ లోగా మీరు ఏమైనా

చెయ్యగలరేమో ఎవరు చెప్పగలరు! ఆవిడ జీవితం గురించి మీకు తెలిసిందంతా ఓ మారు నెమరు వేసుకుని చూడండి. ఆ మూడుగంటల కాలంలో యింకెవరూ యింటికి రాలేదని చుట్టు పక్కలవారు అంటున్నారు.... మరేం జరిగి ఉంటుంది? మాట పడిపోయేటంత తీవ్ర సంఘటన ఏం జరిగిందంటారు? నిద్రపోకుండా మీరే ఆలోచించి చెప్పాలి. అసలు మీ పిన్నీ బాబాయీ సంబంధం ఎటువంటిది? ఒకరితో ఒకరు ఎలా ఉంటారు?"

కుర్రడాక్టరు ప్రశ్నలు అతను లేక పోయినా నన్ను వెంటాడం వేటాడడం మానలేదు. ఏం అనుకోవాలి వాళ్ళ గురించి.

బాబాయి యిలా వాదిస్తాడు. 'ఏ ఆడది మోసినా తొమ్మిది నెలలేగా! సగటున ఓ ఆడది నలుగురు పిల్లల్ని కంటుంది అనుకుంటే మొత్తం జీవితకాలంలో ఆమె భరించేది మహా అయితే నాలుగు తొమ్మిదులు అంటే మూడేళ్ళుగా! ఆమెని సగటున పాతికేళ్ళు ఓ మొగాడు భరిస్తే ఆ మిగిలిన ఇరవైరెండేళ్ళూ ఆమెనీ పిల్లల్నీ తననీ అంత 'మోతా' సాధారణంగా మొగాడిదేగా! ఇదిఎవరికీ కనపడదు కాబోలు. అడిగేవారు లేకపోతేసరి! అని ఆర్గ్యుమెంటుకి తగులుకుంటాడు.

ఇంతకీ పిన్నికి ఇటు పిల్లల మోతగాని అటు బాబాయికి ఇంట్లో ఖాళీకుండలమోత గాని లేనేలేదు! పెద్ద భాగ్యవంతులు కాకపోవచ్చుగాని ఎప్పుడూ దేనికీ ఇబ్బంది పడి ఎరగని సంపద వాళ్ళది. పోషించవలసిన పెద్దలూ పెంచవలసిన పిల్లలూ లేకపోవడంతో మరింత అది పెరిగిందేగాని తగ్గలేదు. పిన్ని దీపావళి ప్రత్యేక సంచికలా ఉంటే బాబాయి ఎక్కాల పుస్తకంలా ఉంటాడు. పైకి ఎంతతేడాగా కనిపిస్తాడో లోపల అంతకి వెయ్యిరెట్లు ఎక్కువ అంతరం వాళ్ళ ఇద్దరి మధ్యా. మొదట్లో నేను వాళ్ళని కలుసుకున్నప్పుడు ప్రతి చిన్న విషయానికీ పెంకులెగిరిపోడం గమనించాను. తర్వాత తర్వాత అంత హోరాహోరీ లేదుకాని ఆ మొహాలు చూస్తే అంటుకున్న ఇళ్ళు కష్టపడి ఆర్పినట్టుండేవి. మరి ఏమనుకున్నాడోగాని బాబాయి ఈ మధ్య దేనికీ జవాబు చెప్పడం మానేశాడు. అప్పటికీ ఇప్పటికీ పిన్ని ఖంగుమనే స్వరానికి మాత్రం ఎదురులేకుండా జరిగింది. ఆ యింట్లో అందుకనే నిశ్శబ్దరత్నాకరంలాంటి ఆవిణ్ణి ఇవాళ చూస్తూంటే అంతగా కలుక్కుమంటోంది నా మనసు.

'మీ పిన్నిలాంటి వాళ్ళకి వర్తమానం భవిష్యత్తు అనేవి అసలు ఉండవు. ఉన్నది ఒక్కటే. దానిపేరు గతం. వాళ్ళ తాతగారి ఇంట్లో పదిమందిలో పెరిగిందితను. తనూ తన తల్లీ. తండ్రీ మేనమామలూ పిన తల్లులూ వీళ్ళగొప్ప చెప్పుకోడం తప్ప మరో ప్రపంచాన్ని ఆవిడ గుర్తించదు. పాతికేళ్ళు నేను ఎన్నో విధాల ట్రైచేశాను. ఒక్కటంటే ఒక్కమార్పు తీసుకురాలేకపోయాను! ఆ పదహారేళ్ళకే ఆమె పరి పూర్ణజ్ఞానం సంపాదించుకుని ఉండాలి. లోకంలో ఇంక ఆమె కొత్తగా నేర్చుకోడానికి ఏం మిగిలిందని చెప్పు! ముందుకి వెళ్లే కాలాన్నే కాదు, ఎదుట ఉన్న మనిషిని సహా ఆవిడ లెక్క పెట్టదు. అందుకే ఆవిడ సాధారణంగా ఇంకొకరితో మాట్లాడి తనని అవమానించుకోదు. తనలోనే తనతోనే మాటాడుకుంటుంది. 'సగం గతం. సగం స్వగతం ఇదే సుమా సనాతన స్త్రీ మనోగతం' అంటూంటాడు బాబాయి.

పిన్ని కంటే నాలుగేళ్ళు చిన్న అనుకుంటానేమో నేను. ఇంతెందుకు చెప్పేనంటే నాతో బంధుత్వమేకాక పెద్దగా వయస్సులో తేడాలేకపోడంచేత బాబాయి తన మనసులోమాట అప్పుడప్పుడు నా ముందు వెళ్ళగక్కుకుని ఉండాలి. పిన్నికి మాత్రం బాబాయి చెప్పినట్టు ఒకరితో చెప్పుకోవలసిన అవసరంలేదు. ఎప్పుడు ఏం మాట్లాడినా తను చెప్పిందే సరి అయినదనే అచంచలమైన ఆత్మవిశ్వాసం ఆమె కంచుకంఠంలో మార్మోగుతూ ఉంటుంది. ఎటువంటి పరిస్థితుల్లోనూ గొంతుక తగ్గించి మాట్లాడ్డం ఆమెకి సరిపడదు 'నాకేం కర్మం, నేనేమైనా తప్పుచేస్తేగా' అంటుంది.

"తప్పు అనే పెద్దమాట ఎందుకు గాని కనీసం పొరపాటు చేసేనని ఆమెచేత అనిపించు చూద్దాం' అని సవాలు చేస్తాడు బాబాయి. అన్నం సరిగ్గా ఉడకలేదనుకో, సరిగ్గా అంటుకోని బొగ్గులు తెచ్చి పడేస్తే ఇల్లాలేం చేస్తుంది? నేతి గిన్నెకి ఆమె కాలు తగిలి బోర్లా పడిందనుకో, దార్లోపెడితే ఏమవుతుంది మరి? ఆఖరికి మనం చూస్తూండగా ఆవిడ చేతిలో గాజుకప్పు జారిపోయి పడి ముక్కలయిందనుకో దాసీముండ కాఫీ జిడ్డేనా వదిల్చిందికాదు, ఇంకోళ్ళైతే యీ పాటికి ఇంట్లో ఒక్క కప్పూ ఉండేదికాదు... ఇంకా నేను కాబట్టి!

ఈ జవాబులు చూసి తనకి మొదట్లో ఒళ్ళు మండిపోయేదిట. ఆ మాటలు తన తప్పు కప్పి పెట్టుకోడానికి కేవలం నోటి లోంచే వచ్చేయేమోనని ఆమె మొహం వైపు పరిశీలనగా చూసేవాడు. దోషలేశం లేని నిర్మలమైన ఆ కవళికలు చూస్తే అతనికి మొదట్లో ఎంతో ఆశ్చర్యమయ్యేదిట. ఇది దుర్మార్గం కాదనీ, అజ్ఞానం మాత్రమే అనీ గ్రహించడానికి అతనికి ఎన్నో ఏళ్ళు పట్టిందిట. ఆసత్యం గ్రహిస్తే ఎంతో వింతగా తోచింది.

'చిన్నప్పుడు చాలా గారాబంగా పెంచి ఉంటారు ఈవిణ్ని. దాని ప్రభావం ఎంత వరకూ ఉందంటే ఫిజికల్ గ్రోత్ పూర్తయిన తర్వాత కూడా అనుభవాల వల్ల మనిషి జీవింతాంతం మానసికంగా ఎదుగుతూ ఉంటాడనే ప్రాథమిక జ్ఞానం లేదు మీ పిన్నికి. ముద్దు చేసిన చిన్న పిల్లల్ని చూడు. వాళ్ళకితోచినట్లే చేస్తామని పట్టుబడతారు. అదే కరెక్టు అనుకుంటారు. అంతకంటే మంచి పథం మరొకటి ఉందని వాళ్ళకి నచ్చచెప్పడం మన తరంకాదు. మీ పిన్ని ఆ స్టేజి దాటినట్టులేదు. చిన్న ఉదాహరణ యిస్తాను విను. ఆ మధ్య మా యింటికి మేష్టారి పెళ్ళాం వచ్చింది. ఈవిడ ఆవిడతో ఏమంటోందో నేను గదిలోంచి విని, గతుక్కుమన్నాను. "పందుల్ని కన్నట్టు పిల్లల్ని కనెయ్యడమే. వాళ్ళకేం కావాలో మంచీచెడ్డా ఆ మాత్రం చూసుకోవద్దూ?" అనేసింది! ఎదురుగా తను మాటాడుతున్న మేష్టారి పెళ్ళానికి పదిమంది సంతానమనీ, ఆవిడ ఏమనుకుంటుందో అనీ లేశమంత స్పృహలేదు మీ పిన్నికి!

బ్రతుకులోని విషాదాన్ని సెన్స్ ఆఫ్ హ్యూమర్ ఎంతవరకూ సేవ్ చేస్తుందంటావ్? ఏమోమరి, ఆ ఆధారంలోనే ఈ బండి నడుపుతున్నాను! పిల్లలులేని బతుకు పెద్ద విషాద గాథే కాని, నలభై ఏళ్ళ పసిపిల్ల ఇంట్లో నడయాడుతోంది, చాలదంటావా?

మరోసారి కలిసినప్పుడు బాబాయి ఇలా అన్నాడు:

'మోసంతో స్వార్థంతో నిండిపోయి వున్న ఈ పాడు ప్రపంచంలో మీ పిన్నిలాంటి అమాయకురాళ్ళు చాలా అరుదు. నేర్పు, లౌక్యం చలాకీతనం, చాతుర్యం ఇవన్నీ బతుకు నేర్పే పాఠాలు..... ఆలోచించి చూస్తే అబద్ధానికి పర్యాయపదాలు. స్కూల్లో పాఠాలు ఎలాగాలేవు, ఇవైనా నేర్చుకోకుండా ఎప్పటికీ ఒకే పద్ధతిలో జీవితాంతం నిలబడిన నిజాయితీకి నిలువునా మ్రొక్కవలసిందే. ఆ మంచితనం కేవలం గుండెకి సంబంధించిందేకాదు. మీ పిన్ని ప్రతి పనిలోకూడా అది కనబడుతుంది. ఆవిడ ముందు చెయ్యిజాచి ఉత్తి చేతుల్లో వెళ్ళిన ఒక వ్యక్తిని చూపించలేవు నువ్వు. ఎవరు ఏ కష్టంలో ఉన్నా, తను ఎంత యిబ్బంది పడైనా ఆదుకునే ఉదారమూర్తి ఆవిడ. మహోన్నతమైన మానవతా దృక్పథానికి సజీవ సటీక మీ పిన్ని..... అందుకనే యిన్నాళ్ళ పాటు తనతో కలిసి ఉండగలిగాను, ఇంకా తన గురించి ఆలోచించకుండా ఉండలేకపోతున్నాను!''

గోడ గడియారం ఏకవచనంతో బహు వచనంతో అలాగంటలు కొడుతూనే ఉంది. అవి ఎన్నో లెక్కపెట్టనంతగా ఆలోచనలో మునిగిపోయాను. పాలవాడు వస్తే చూశాను. అయిదూ నలభై. లేచి మొహం కడుక్కుని కాఫీ చేసుకుతాగేను. అలా పిన్నిని చూస్తూంటే యింకా బాబాయి ఎన్నెన్నో చెబుతున్నట్టే వుంది.

'ఇంత మంచి మనిషికి ఇంత పిసరు ఆలోచన అయినా లేదంటేచూసి అనుభవిస్తేగాని నమ్మడం కష్టం. ప్రపంచం కూడా అంత మంచిగానూ ఉంటే, ఎంత ఔట్ స్పోకెన్‌నెస్ అయినా చెల్లుతుంది. కాని యీ మాయదారి లోకంలో అడుగడుగునా ఎంత నటన చూపిస్తే కాలం వెళ్ళను. పోన్లే బాబూ.... యిన్నేళ్ళూ వెళ్ళేయి కావా, ఇప్పుడు వెళ్ళవా..... అప్పుడే మా బతుకుల్లో సంజ ప్రవేశించింది, ఎంతట్లో చీకటి పడాలి!

బాబాయి రిటైర్ అయి ఆరు నెలలు కాబోలు అయింది. తను రిటైర్ అయాక ఇదే నేను కల... . వాళ్ళ పొలం ఉన్న ఊరు వెళ్ళేముందు నాతో చెప్పిందిఏమిటా అని గుర్తుతెచ్చుకుంటున్నాను. కాబోయే సైకియాట్రిస్ట్ చెప్పేడుగదా ప్రతి చిన్న విషయం మననం చేసుకోమని.....

'ఇప్పుడు రోజంతా యింటి పట్టున ఉండిపోవడం చేతో, ముసలితనపు చాదస్తం తలకెక్కిందో మునపటిశాంతం ఉండడంలేదు. ఎంత ప్రయత్నించినా దానికి జవాబు చెప్పడం ఏనాడో మానేశాను గాని రియాక్ట్ కాకుండా మాత్రం ఉండలేక పోతున్నాను. మాట్లాడితే పైకి వచ్చే శబ్దం ఉంటుంది చూడు అదిచెవిలో పడితే ఎందుకోగాని ఒళ్ళంతా చెమటపట్టేస్తోంది.''

అర్థంగాక తెల్లబోయి చూశాను. ఆయన విశదీకరించాడు. ఇంట్లో చేసుకునేకొన్ని కొన్ని పనులు చప్పుడు అవకుండా చెయ్యడానికివీల్లేనివి. 'బుస్' అంటేగాని పాలు పొంగవు. 'చుంయ్' అనందే అట్టు వేగదు. మజ్జిగ తిప్పినా, పచ్చడి రుబ్బినా శబ్దం అయి తీరుతుంది. కాని కొన్ని కొన్ని పనులు గుట్టు చప్పుడుగా చేసుకోవచ్చు. మెత్తటి పరుపు మీద కూచునేటప్పుడు 'ధన్' మనీ, నడిచేటప్పుడు 'దబ్' మనీ ఏ తలుపో తీసినప్పుడు 'కిర్రు' మనీ, ఆఖరికి మంచినీళ్ళు తాగినా పక్క గదిలోకి వినిపించేలా

'గుట గుట' మనీ చప్పుడు చెయ్యాలంటావా? పోన్లే అలవాటై పోయింది! యివన్నీ ఎలాగైనా భరిస్తాను. పొద్దుట లేచింది మొదలు పడుకునేదాకా అలా నాలుగిళ్ళకి వినిపించేలా వాగుతూ ఉండక తప్పదంటావా? శ్రోతని ఎదిరించో ఎదురిచ్చో అంతు చూసేదాకా అదరగొట్టే ఉపన్యాసకులు ఎక్కడైనా తారసపడతారు. ఎదుట మనిషి లేకుండా ఏక బిగిని ఎకరువు పెట్టే వాళ్ళని ఎన్నాళ్ళని భరించడం? పోనీ కష్టపడి విన్నా అందులో గురివింద గింజ ఎత్తు రీజను గాని సెన్స్‌గాని లేకపోతే ఎలా ఊరుకోవాలి? నాకు త్వరలో చెవుడొచ్చే ఉపాయం చూద్దూ. నీకేమైనా యిచ్చుకుంటాను....

పిన్ని అటూ ఇటూ కదలినట్టయింది. తొందరగా లేచి దగ్గరగా వెళ్ళేను! 'ఏం పిన్నీ; ఎలా ఉందీ, అసలు ఏం జరిగిందీ, నోరు పుక్కిలించి ఇంత కాఫీ తాగుతావా?' అని గబ గబ మాట్లాడేసి నా ఉద్రేకానికి తిట్టుకున్నాను. కొంచెం నయమేమో అనిపిస్తోంది గాని చెప్పుకోదగిన రెస్పాన్స్ మాత్రం ఏమీలేదు. కళ్ళు విప్పింది. ఆ చూపు నిన్నటిలా ఎప్పుడూ శూన్యంలోకి కాదు. అరుదుగా గుడ్లు యిటూ అటూ ఆడిస్తోంది. కుర్ర డాక్టర్ని పిలిపించాను.' షీయీజ్ బెటర్' అని మరో యింజక్షన్ ఇచ్చి వెళ్ళేడు ఇక్కడున్నట్టు వస్తా అనుకుంటూ.

ఆరుంపావు అయింది. మబ్బు వేసిందేమో ఇంకా చీకటి పూర్తిగా వదిలినట్టు లేదు. ఆ సరికే యిరుగూ పొరుగూ ఈగలు ముసిరినట్టు ముసిరిపోయారు ఎలా ఉందంటూ. ప్రతి ఒక్కరూ పిన్నిని పొగిడేవారే. 'ఇంకా రాలేదా మీ బాబాయి' అని కొందరూ, అసలు ఏం జరిగిందో అంతు చిక్కిందా? అని మరికొందరూ. ఒకరిద్దరు ముఖ్యుల్ని ఉంచి మిగిలిన కుర్రసజ్జుని వెడల నడిపేసరికి నా తాడు తెగింది.

ఈ లోగా ఎందుకో పిన్ని నోరు తెరిచింది. కళ్ళతో ఏదో చెప్పడానికి ప్రయత్నిస్తోంది. తడిగుడ్డతో మొహంతుడిపించి ఎలాగో నాలుగు చెమ్చాల కాఫీ పట్టగలిగేను. అతి నెమ్మదిగా ఆమె ఏదో గొణుక్కున్నట్టు అనిపించింది. అంతకు ముందే అక్కడ చేరిన కుర్రడాక్టరు మిగిలిన వాళ్ళని కూడా బతిమాలి పంపేసి వీధి తలుపు గడియవేసి వచ్చి ఆమె నోటి దగ్గిర చెవి పెట్టుకు కూచున్నాడు. "మనకి ఎంతో పనికిమాలిన విషయమే ఆమెకి అతి ముఖ్యమని తోచొచ్చు. అలాంటి మాటగాని సంఘటనగాని రాత్రి మీకేమీ స్ఫురించలేదా?'' అన్న అతని ప్రశ్నకి లేదని తల ఊపేను.

అని పిన్ని చెవిలో నోరుపెట్టి, డాక్టరు ఎంతో ప్రయత్నించిన మీదట, ఎంత గట్టిగానో అరచిన మీదట. ఆమె అంగీకారంగా నుదురూ కళ్ళూ కొద్దిగా ఊపింది. అతని కళ్ళు మిల మిల మెరిశాయి. "చూశారా, చూశారా? ఆమెకి వినబడుతోంది, కనబడుతోంది. బోధపడుతోంది. ఇంక రానిది గొంతుక ఒకటే. ఆమె స్వరపేటికని దెబ్బ తీసిన సంఘటన ఏదో ఆమె చెప్పాలని విశ్వప్రయత్నం చేస్తోంది. ఇప్పుడే మీరామెకి చేయూత నివ్వాలి. ఆమె మాటకి మళ్ళీ జీవం పొయ్యాలి. ఇలా దగ్గిరగా రండి. చెవులు రిక్కించి వినండి.''

కొట్టుకొనే గుండెలతో పిన్ని నోటి దగ్గిర చెవిపెట్టి కూచున్నాను. ఎంతో ప్రయత్నంతో

కూచున్నాను. ఎంతో ప్రయత్నంతో అతి హీన స్వరంతో పిన్ని నోటినుండి రెండు అక్షరాలు వచ్చేయి. బాబాయికి బాగోలేదని కలో ఏదో వచ్చిందేమో... అడగండి. గొంతుక చించుకునేలా చెవిలో అరిచాను. అలాంటి ప్రమాదమేమీ లేదనీ ఆయన కులాసాగానే ఉన్నాడనీ.

ఈ సారి అంతకంటె సులువుగానే తల అడ్డంగా తిప్పింది. అదేమీకాదని 'అయితే ఏమిటంటావు' నోటితో అరవలేక గుప్పెట కదిల్చి ప్రశ్నించాను.

మళ్ళీ అదేమాట 'బాబా' మొన్నో ఎప్పుడో ఆవిడ బాటాజోడు కొనుక్కుంది. అది కరుస్తోందని చెప్పినట్టు గుర్తు.

రాసి చూపించడానికి అక్షరాలే తప్ప గుణింతాల దాకా ఆవిడ చదువువెళ్ళలేదు! "బాటా జోడు బాధిస్తోందంటావా?" అని అరిచాను.

నుదురు చిట్లించింది. ఎంత మాత్రం కాదని. అయినా అంత మాత్రం చేత గుండె దెబ్బతిని ఎవరైనా అవాక్కు అయిపోతారా!

'చెప్పు పిన్నీ, ఏమిటి కావాలంటావు నీకూ. ఎందుకూ ఆందోళన పడ్డావు. బాబా అవే మాటలు అదే జంటనాదం అందులోనే యిమిడి ఉంది. ఆమె శబ్ద రహస్యమంతా అదేమిటో తెలిసి చావడం లేదు. క్రాస్‌వర్డ్ పజిల్ కన్న సీక్రెట్ కోడ్ కన్న మించి పోయింది. సులువు కాకపోనీ ఆ మాటలతో ఆరంభమయ్యే తెలుగు పదాలూ వాక్యాలూ వాడి వాడి విసిగిపోయాను. ఇంకా వేగంగా అడ్డంగా తల తిప్పుతోంది పిన్ని. ఏందారి?

"మీరలా టైర్ అయిపోతే లాభం లేదు. తనని ఎవరూ రక్షించలేరనే హెల్ప్ లెస్ నెస్‌లో గాని ఆమె పడిపోతే యిక బ్రతుకంతా మూగదై పోతుంది. ప్లీజ్ ట్రైగైన్ .... ఏమిటి 'బాబా' అంటే? అన్నాడు డాక్టరు. నామజపాన్ని మించిన మహాశాస్త్రం ప్రపంచానికి మరొకటి లేదుగదా. ఆ మెజీషియన్ విద్యకాదు. గదా ఇది అనిపించింది. వెంటనే ఎదురింటికి పనిమనిషిని పరిగెత్తించి నిలువెత్తుబాబాగారి ఫొటోను తెప్పించి పిన్ని కళ్ళముందు ఉంచుతూ అడిగేను.

"బాబాయే బాధలన్నిటికీ విరుగుడు" అని నీ ఉద్దేశం అంతేనా?"

పిన్ని అతికోపంగా చూసింది అదేం కాదు పొమ్మనట్టు.

"మరేమిటి నీ త్రాద్ధం? అన్నాను ఒళ్ళుమండి.

'బా.బా.'

తలపట్టుకుని డాక్టర్ని సందులోకి తీసుకొచ్చాను. నాకే యింజక్షను యివ్వమని బతిమాలుతూ. ఆయన నవ్వుతూ మందలించాడు.

ఆ సందుగోడ బాగాఎత్తు. పట్టపగలే. చీకటి అవతలి చివరనుంచి వెలుగు రావడం ఆశ్చర్యమని పించింది నాకు. ఆ గొడవలోపడి ఆ చివర నీళ్ళగది ఉందనీ అందులో లైటువెలిగి ఉంటే ఆ కాంతి కొంతవరకూ రావొచ్చుననీ ఆక్షణం నాకు తట్టనేలేదు. ఇక్కడ ఆ నీళ్ళగది గురించీ ఆ లైటు

గురించీ కొంతచెప్పాలి. ఇద్దరన్నదమ్ములూ ఇళ్ళు పంచుకుంటే ఆచివరి గది ఇవతలివాటాలోకి కొత్తగా వచ్చి చేరిందిట. అది పూర్వం వంటగదిట. చీకటిగా ఉంటుందని అందులో ట్యూబ్‌లైట్ వేయించుకున్నారట. ఇప్పుడు వీళ్ళు దాన్ని నీళ్ళగదిగా వాడుతున్నాడు. ఆ గదిలో లైటుకీ, సందులో లైటుకీ స్విచ్చి ఇప్పుడు పిన్ని పడుకున్న హాలులోనే ఉంది. 'నీళ్ళ గదిలో లైటు ఆర్పేరో లేదో' అవి రోజుకి ఓ వందసార్లయినా ఆత్రుత పడుతుందిట పిన్ని. అనవసరపు విషయాలకి అతిప్రాముఖ్యత ఇవ్వడం ఆమెకి అలవాటుకదా!

చలికి ముష్టిది వణుకుతోందని కప్పుకున్న వంద రూపాయిల దుప్పటి దానికిచ్చెయ్యడం. పిన్నికి దూబరా అనిపించదు. ఓ నిముషం ఓ లైటు ఎక్కువ వెలిగిందో ఆమెకి హార్టు ఎటాక్‌వచ్చేస్తుంది! ఆమె ఆలోచనలో 'రీజన్' ప్రవేశపెట్టడం మాత్రం నా వల్ల కాలేదు. అందుకే బాబాయి కళ్ళు తేలవేసేది. 'సందులో ఆ వెలుగేమిటే?' అన్నాను లోపలికొచ్చి పనిమనిషితో. అది నాలిక కరుచుకని హాల్లో స్విచ్ ఆపేసింది. 'బాత్రూములో బార్‌లైట్' అని చెబుతూ ఆ మాట ఎక్కడ చెవినపడిందో పిన్నికి ఆటోమేటిక్ మాటవచ్చేసింది. బా.బా అయిపోయింది! అంతసేపూ బందీ అయిన ఆమె వాక్శక్తికి ఇండిపెండెన్సు వచ్చేసింది. ఎందుకలా జరిగిందో ఆవిడే చెప్పింది.

"రాత్రి వాకిట్లోకి వెడదామని, సందులోకి వచ్చి చూశాను. అప్పుడే తొమ్మిది కొడుతున్నారు. బాత్రూంలో బార్ లైటు వెలుగు కనిపించింది. 'ఇంతసేపూ ఇది వెలిగే ఉందా! అని గుండె గుభేలుమంది!" ఇప్పుడీ పనిముండకి పట్టింది. వచ్చిన చుట్టానికి పట్టలేదు. కట్టుకున్న యజమాని సరేసరి. అంతే" ఆ వాక్ప్రవాహానికి ఇక అడ్డులేకపోయింది. అప్పుడే వచ్చిన బాబాయికి వీధిలోంచే పిన్ని మాట వినిపించి ఉండాలి. అతని ఆశ అడుగంటిపోయింది. 'ఏదైనా చెయ్యి 'వాగ్దానం'తప్ప! 'ఎవరికైనా చెయ్యి మీ పిన్నికి తప్ప' అన్నట్టున్న అతని చూపులు తట్టుకోలేక తలకిందకి దించుకున్నాను. యావజ్జీవం తన భార్య మాటరాకుండా ఉండిపోవాలనే మా బాబాయి కోరిక ఆవిధంగా అత్యాశగానే మిగిలింది!

★